సాక్షి మంచిర్యాల

ఆదివారం । 14 । జూలై । 2024



స్థలం బల్దియాది..

మంచిర్యాల మున్సిపల్ స్థలంలో అక్రమంగా టేలాలు వెలుస్తున్నాయి. ఆక్రమణల తొలగింపునకు బల్దియాలో తీర్మానించినా చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారు. 9లో ▸



కవ్వాల్.. జంతువుల కళకళ

కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలో విస్తరించి ఉన్న అడవి వన్యప్రాణులకు ఆవాసం, అనువైన ప్రదేశంగా మారుతోంది. వన్యప్రాణులు, జంతువుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు బదిలీ



ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు శనివారం బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లా ముదిగొండలోని ప్రభుత్వ సాంఘి క సంక్షేమ సంక్షేమ గురుకుల విద్యాలయానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో హుస్నాబాద్ సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బదిలీపై రానున్నారు. సైదులుకు సహచర ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. కొందరు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తొమ్మిదేళ్లు ఇక్కడ పని చేసిన ఆయన విద్యార్థులు, తల్లిదండ్రులతో మమేకం అయ్యారు. ఆయన శిష్యరికంలో పదుల సంఖ్యలో డాక్టర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు అయ్యారు. ఐఐటీ, అజీమ్‌ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీట్లు సాధించేలా, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటేలా తీర్చిదిద్దారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక ఫలితాల్లో వంద శాతం ఫలితాల సాధనలో సఫలీకృతం అయ్యారు.

నేటి నుంచి అగ్నిగుండాల మహోత్సవాలు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం నుంచి అగ్నిగుండాల పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతియేటా తొలి ఏకాదశి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు వేడుకలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం మల్లన్నస్వామి, భ్రమరాంబికలకు పవిత్ర గోదావరి నదిలో గంగస్నానం, సోమవారం పెద్దపట్నం వేసి ఒగ్గు పూజారులతో సంప్రదాయబద్ధంగా మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం భక్తులు అగ్నిగుండాల్లో నిప్పులపై నడుస్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కులు చెల్లిస్తారు.

సాగునీటి కోసం తంటాలు



కాలువలోని చెత్తను తొలగిస్తున్న రైతు

జన్నారం: కడెం కాలువ సౌకర్యం లేని కవ్వాల్ గ్రామ రైతులకు ఏటా సాగునీటి కోసం తంటాలు తప్పడం లేదు. వర్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కవ్వాల్ గ్రామంలో రామునిచెరువుకు వాగుల ద్వారా నీరు చేరుతుంది. వర్షాలు పడి వాగులు ఉప్పొంగితే కాలువ ద్వారా నీరు చెరువులోకి చేరుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మత్తడి వాగు ఉప్పొంగడం వల్ల చెరువు కోసం తీసిన కాలువ గుండా నీరు రావాల్సి ఉంది. కాలువలో చెత్త, ఇసుక చేరడంతో నీరు రావడం లేదు. శనివారం రైతులు కండ్లె దుబ్బయ్య, మహ్మద్ అలీఖాన్, రంగు వెంకటేశం, పంబాల శ్రీనివాస్ తదితరులు కాలువకు అడ్డుగా చేరిన ఇసుక, చెత్త తొలగించి నీరు వెళ్లడానికి మార్గం చేశారు. చెరువులు నింపే మత్తడి వాగు నుంచి వెళ్లే కాలువకు శాశ్వత పరిష్కారం చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. వాగుకు అడ్డంగా గేట్లు ఏర్పాటు చేస్తే నీరంతా కాలువ ద్వారా పోతుందని పేర్కొంటున్నారు.

నూతన జిల్లాల బాక్సింగ్ అసోసియేషన్‌కు గుర్తింపు లేదు



రఘునాథ్‌రెడ్డికి వివరాలు అందిస్తున్న శేఖర్

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి పది జిల్లాల అసోసియేషన్లకు మాత్రమే గుర్తింపు ఇచ్చిందని, నూతనంగా ఏర్పడిన జిల్లాలకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ సంఘం, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డిని కలిసి వివరాలు అందజేశారు. కొత్త జిల్లాల సంఘం బాధ్యులమంటూ ఎవరైనా ఎంపిక, ఇతర కార్యక్రమాలను చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొట్టె దేవేందర్ పాల్గొన్నారు.

చదువు చెప్పేదెవరు..!

- సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థులు లేని చోట టీచర్లు ఎక్కువ మంది
- విద్యార్థులు ఉన్న స్కూళ్లలో తక్కువ మంది..



ముల్కల్లలోని జిల్లా పరిషత్ పాఠశాల

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలు పునఃప్రారంభమై నెల రోజులు గడుస్తోంది. టీచర్ల పదోన్నతి, బదిలీలతోనే ఉపాధ్యాయుల సమయమంతా గడిచిపోయింది. పాఠాలు సాగిన రోజులు అంతంతే కాగా.. ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. ఎస్‌ఏ పదోన్నతులు, ఎస్జీటీల బదిలీలు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ఖాళీలు ఏర్పడ్డాయి. 2,855 పోస్టులకు గాను 2,383 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తుండగా 472 ఖాళీలు ఉన్నట్లు తేల్చారు. వీటీల నియామకంపై స్పష్టత కరువైంది. అప్పట్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కొన్ని పాఠశాలల్లో ఇద్దరు పని చేయాల్సిన చోట ముగ్గురేసి టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థుల సంఖ్య తక్కువ.. విద్యార్థులు ఉంటే టీచర్ల సంఖ్య తక్కువ కావడంతో చదువులపై ప్రభావం పడుతోంది. ఇప్పట్లో కొత్తవారు వచ్చే అవకాశాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా టీచర్ల సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంటు) తప్ప చేసేదేమీ లేదు.

ఇవేమి నిబంధనలో..

ఎస్‌ఏ పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల రిలీవ్‌కు సుముఖత వ్యక్తం చేసిన విద్యాశాఖ నిబంధనల పేరిట బదిలీ అయిన ఎస్జీటీల విడుదలకు అభ్యంతరం చెప్పింది. బడుల్లో ఉపాధ్యాయుడు లేకున్నా ఎస్‌ఏ పదోన్నతి పొందిన వారందరినీ వెనుకాముందు చూడకుండా రిలీవ్ చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో పక్కన ఉన్న టీచర్లకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా కేంద్రం హరిజనవాడ పాఠశాలలో ఉపాధ్యాయులకు పదోన్నతులు రాగా అక్కడి నుంచి ఇతర పాఠశాలల్లో చేరారు. ఆ పాఠశాల బాధ్యతలను పక్కన ఉండే మరో స్కూల్ టీచర్‌కు అప్పగించారు. జవహర్‌నగర్ పాఠశాలలోనూ అదే పరిస్థితి. ఇంకోవైపు బదిలీ అయిన ఎస్జీటీలను రేషనలైజేషన్ పేరిట రిలీవ్ చేయకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌ఏ పదోన్నతిపై వెళ్లిన ఆయా పాఠశాలలకు బదిలీ టీచర్లు వచ్చే అవకాశాలున్నా నిబంధనలు అడ్డు రావడంతో ఇన్‌చార్జి ఉపాధ్యాయులతో నెట్టుకు రావాల్సి వస్తోంది. 575మంది బదిలీ అయినా సగానికిపైగా ఎస్జీటీలు ఎదురుచూడక తప్పడం లేదు.

మరోసారి సర్దుబాటు

గతేడాది పాఠశాలల్లో 153 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఇప్పటికే ఎస్‌ఏ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చేరడంతో ప్రస్తుతం 50 మంది సర్దుబాటుతో విధుల్లో కొనసాగుతున్నారు. ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలి. గతంలో సర్దుబాటు పేరిట టీచర్లలో గందరగోళం నెలకొంది. ఒకే మండలం తర్వాత పక్కా మండలం నుంచి ఉపాధ్యాయులను కాకుండా ఇతర దూర మండలాల నుంచి సర్దుబాటు చేసినట్లు తేలింది. 2024–25 విద్యాసంవత్సరానికి గాను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు తావులేకుండా పకడ్బందీగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంది.

ఆటంకం లేకుండా చర్యలు

విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ఉపాధ్యాయుల కొరత అధిగమించేందుకు టీచర్ల సర్దుబాటు చేశాం. పదోన్నతులు, బదిలీల తర్వాత పాఠశాలలో ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో సేకరిస్తున్నాం. పూర్తి కాగానే టీచర్ల సర్దుబాటు చేస్తాం.

– యాదయ్య, డీఈవో

పాఠశాలల్లో టీచర్ల సమస్య

ఒక్కో బడిలో ఒక్కో సమస్య నెలకొంది. టీచర్లు ఉంటే విద్యార్థులు తక్కువగా ఉండగా, విద్యార్థులు ఉంటే టీచర్లు తక్కువగా ఉన్న పాఠశాలలు ఉండగా.. ఇంకోవైపు సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది.

- చెన్నూర్ రోడ్ పాఠశాలలో 117మంది విద్యార్థులు ఉండగా.. ఒక పీఎస్ హెచ్‌ఎంతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు బోధించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక టీచర్ మాత్రమే ఉండగా.. మరొకరిని సర్దుబాటు చేశారు. ఇంకొకరు అవసరం ఉంది.
- తాండూర్ జెడ్పీఎస్ఎస్‌లో 300 మంది విద్యార్థులు, 22మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ లెక్కన ముగ్గురు టీచర్లు అధికంగా ఉన్నారు. మరో బడికి సర్దుబాటు చేసే వెసులుబాటు ఉంది.
- భీమారం మండలం దాంపూర్ స్కూల్లో 22మంది విద్యార్థులు, ఇద్దరు ఎస్జీటీలు, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఉన్నారు. 6, 7వ తరగతుల్లో విద్యార్థులు లేకపోవడంతో ఎస్‌ఏ ఖాళీగా కూర్చునే పరిస్థితి.
- భీమారం ప్రైమరీ పాఠశాలలో 43మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఏడెనిమిది మంది ప్రైవేటు స్కూల్‌కు వెళ్తున్నట్లు తెలుస్తోంది. నలుగురు ఉపాధ్యాయులు ఉండగా.. విద్యార్థుల సంఖ్య కంటే ఒక టీచరు ఎక్కువే.
- హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత సమస్యగా మారింది. 193మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడి సోషల్ టీచర్ ఉద్యోగ విరమణ పొందారు. మరో ఇంగ్లిషు టీచర్ విదేశాలకు వెళ్లారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి భర్తీ చేయాల్సి ఉంది.
- నక్కలపల్లి పాఠశాలలో 29మంది పిల్లలు ఉండగా.. హెచ్‌ఎం, ఆరుగురు టీచర్లు ఉన్నారు. నిబంధనల మేరకు సబ్జెక్టుకో టీచర్ లెక్క తప్పనిసరి కావడంతో బయోసైన్స్, తెలుగు టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- కోటపల్లి హైస్కూల్లో 69 మంది విద్యార్థులు, 10 మంది టీచర్లు ఉన్నారు. సోషల్ టీచర్ పోస్టు ఖాళీగా ఉండగా.. తెలుగు, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, గణితం ఇద్దరేసి టీచర్లు ఉన్నారు. కోటపల్లి నుంచి నక్కలపల్లికి టీచర్లను సర్దుబాటు చేసే వీలుంది.
- వేమనపల్లి హైస్కూల్లో 201 మంది విద్యార్థులు, హెచ్‌ఎంతోపాటు ఐదుగురు ఉన్నారు. సబ్జెక్టుకో టీచర్ లెక్కన సోషల్, బయోసైన్స్, ఇంగ్లిష్ ఖాళీ ఉంది. నీల్వాయిలో 175 మంది విద్యార్థులు, పది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. బయోసైన్స్ పోస్టు ఖాళీగా ఉండగా, తెలుగు, గణితం, ఫిజికల్‌సైన్స్ సబ్జెక్టులకు ఇద్దరేసి టీచర్లున్నారు.
- మల్లంపేట్ హైస్కూల్లో 35మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. గణితం, బయోసైన్స్ ఖాళీలున్నాయి. సిర్సా, పారుపల్లి హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్ ఖాళీగా ఉంది. ఒకే మండలంలో ఇద్దరేసి టీచర్లు ఉన్న పాఠశాలల నుంచి సర్దుబాటు చేస్తే సమస్య తీరనుంది.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

నెన్నెల: డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలని, మరో 45రోజులు వాయిదా వేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గత కొంతకాలంగా డీఎస్సీ అభ్యర్థులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోకుండా డీఎస్సీ పరీక్ష తేదీలను ప్రకటించడం నిరుద్యోగులపై కక్షసాధింపు చర్యగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. వరుస పోటీ పరీక్షలు వస్తుండగా నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని, గ్రూపు–2 పరీక్షలు కూడా వాయిదా వేయాలని పేర్కొన్నారు. నిరుద్యోగుల పోరాటం ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి, బల్మూరి వెంకట్ కల్పించుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రగతిశీల యువజన సంఘం తరఫున నిరుద్యోగులతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

దళిత కుటుంబాలకు పరామర్శ



వివరాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

భీమారం: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో దళిత కుటుంబాలను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు జిల్లపల్లి వెంకటేష్ బృందం శనివారం పరామర్శించింది. గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించింది. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూముల్లో కట్ట నాగరాజు ఆరు ట్రాక్టర్లతో పంటలు ధ్వంసం చేసి కులం పేరుతో దూషించడం శోచనీయమని అన్నారు. మద్దికల్ శివారులో 30 ఎకరాల్లో ఆరెపల్లి గ్రామానికి చెందిన దళితులు తాతల కాలం నుంచి పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఆ భూములను ఆక్రమించుకునేందుకు అక్రమ పట్టాలు చేసుకుని దాడులు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఈ విషయమై కమిటీ ఆధ్వర్యంలో రామగుండం పోలీసు కమిషనర్‌తోపాటు జిల్లా కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. దళితులకు న్యాయం జరిగే వరకు కమిటీ వారి వెంట ఉంటుందని అన్నారు. కాగా, జరిగిన దాడిపై దళితులను అడిగి తెలుసుకున్నారు. సభ్యులు దశరథం, జాగిరి రాజేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల ముప్పు



జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన డ్రెయినేజీ నీరు



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం

- పారిశుధ్యం, పరిశుభ్రతలే ముఖ్యం
- కానరాని ఫాగింగ్
- జ్వరాల బారిన ప్రజలు
- ఆసుపత్రుల్లో పెరిగిన రోగుల తాకిడి

జిల్లాలో నమోదైన జ్వరం కేసులు

ఏప్రిల్	6,136
మే	6,487
జూన్	6,171
జూలై	2,140 (ఈ నెల 10వరకు)

మంచిర్యాలటౌన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న వేళ పారిశుధ్యం, పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంటే గతంలో మాదిరిగా వ్యాధులు పెద్దఎత్తున ప్రబలే ప్రమాదం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడ నీరు మడుగులుగా మారడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే డ్రెయినేజీల్లోని చెత్తాచెదారం తొలగించాల్సి ఉన్నా, పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడంతో జిల్లా కేంద్రంతోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా డ్రెయినేజీ నీరు రోడ్లపైనే పారుతోంది. ఖాళీ స్థలాల్లో మురికి నీరు చేరి పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రాత్రివేళ వర్షాలు కురవడం, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వాతావరణంలో భిన్నమైన మార్పులు కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం అత్యధికంగా వేడి, రాత్రి సమయంలో చల్లని భిన్నమైన వాతావరణంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దోమలు విజృంభిస్తున్నా పట్టణాలు, గ్రామాల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమకాటుకు గురవుతున్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్రతతో రోగులకు కొత్తగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వార్డులు, ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయింది. వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్, మండల, గ్రామీణ ప్రాంత అధికారులు సమన్వయంతో పారిశుధ్యాన్ని మెరుగుపరిస్తే సీజనల్ వ్యాధుల ముప్పును కొంతవరకైనా తగ్గించే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు డెంగీ కేసులు నమోదు కాకపోవడం ఊరటనిస్తున్నా.. జ్వరం కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఇప్పుడిప్పుడే జ్వరాలు వస్తున్నాయి..



వర్షాలు కురుస్తుండడంతో కొత్త నీరు వచ్చి ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. ఇతరత్రా సీజనల్ వ్యాధులు రాకుండా జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమలు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. నిల్వ నీటిని తొలగించడం, దోమల లార్వా ఏర్పడితే, దానిపై మందు చల్లి దోమలు వృద్ధి చెందకుండా చేస్తున్నారు. హాస్టల్ విద్యార్థులకు దోమతెరలు ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

ముగిసిన ఆర్కే–7 గని లీజు

- అటవీ శాఖ నుంచి అభ్యంతరాలు
- పని స్థలాలు బంద్ చేయాలని ఆదేశాలు
- గని కొనసాగింపుపై గందరగోళం
- రెండో లీజు ఏరియాలో పని స్థలాలకు కసరత్తు
- ఉద్యోగుల బదిలీలపై ఆందోళనలు



ఆర్కే–7 గనిముఖ ద్వారం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే–7గని అటవీ లీజు వ్యవహారంపై గందరగోళం నెలకొంది. భూగర్భం నుంచి బొగ్గు తీసినా కూడా గని పైభాగం అటవీ శాఖ పరిధిలో ఉంటే ఆ శాఖ నుంచి లీజుకు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ గని విస్తరించిన 20శాతం ఒక లీజు, 80శాతం మరో లీజు పరిధిలో ఉన్నాయి. 80శాతానికి సంబంధించి అటవీ శాఖ ఇచ్చిన లీజు కాల పరిమితి డిసెంబర్ 31, 2020లో ముగిసింది. అంతకు ముందే 2018లో ఏరియా అధికారులు లీజు రెన్యూవల్ కోసం కేంద్ర అటవీశాఖకు దరఖాస్తు చేశారు. లీజు కొనసాగింపుపై ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చింది. కంపెనీ ప్రత్యుత్తరాలు జరిపినా లీజు రెన్యూవల్‌కు అనుమతి రాకపోవడంతో పెండింగ్‌లోనే ఉంది. ఈ క్రమంలో లీజు లేకుండా గనిని ఎలా నిర్వహిస్తారని ఇటీవల జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌ఓ) ఏరియా అధికారులకు నోటీసులు ఇచ్చారు. లీజు లేని వర్కింగ్ ప్లేస్‌లు బంద్ చేయాలని పేర్కొన్నారు.

సీఎండీ సైతం చర్చలు..

ఈ విషయమై కొద్ది రోజుల క్రితం సింగరేణి సీఎండీ బలరాంనాయక్ కూడా కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారులతో ఢిల్లీలో చర్చించి లీజు రెన్యూవల్ చేయాలని కోరారు. వారు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై వివరాలు సమర్పించారు. కంపెనీ కూడా అభ్యంతరాలకు సమాధానం ఇస్తూ సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేస్తూనే ఉంది. తాజాగా అటవీ అధికారులు లీజు లేనందున మైన్ కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పని స్థలాలు బంద్ చేయాలని ఆదేశించడంతో అధికారులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. లీజు రెన్యూవల్ అయ్యే వరకు అటవీ శాఖ ఇబ్బందులను అధిగమించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో లీజు ఏరియాలో బొగ్గు వెలికితీతకు సాధ్యాసాధ్యాలపై అన్వేషణ చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు పని స్థలాలు సిద్ధం చేసి బొగ్గు ఉత్పత్తి చేయడం సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న ఉద్యోగులతో 20శాతం అనుమతి ఉన్న మైనింగ్ ప్రాంతం నుంచి బొగ్గు ఎలా తీయాలో అధికారులు కార్పొరేట్ అధికారులు చర్చిస్తున్నారు. సోమవారం నుంచి లీజు రెన్యూవల్ కాని ఏరియాలోని పని స్థలాలు బంద్ చేయాలని అధికారులు నిర్ణయించారు.

ఉద్యోగుల సర్దుబాటు

గనిలో ప్రస్తుతం 1400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. రెండు సీమ్‌లు నడుస్తున్నాయి. సోమవారం నుంచి సీమ్‌లలో పనులు బంద్ చేయనున్నారని తెలిసింది. రెండో లీజు ఏరియాలో బొగ్గు తీయడానికి ఏర్పాట్లు చేసినా ఇంత మ్యాన్ పవర్ ఉపయోగపడదు. కొద్ది మందిని గనిలో సర్దుబాటు చేసి మిగతా వారిని ఇదే ఏరియాలోని ఇతర గనుల్లో సర్దుబాటు చేసే ఆలోచన చేస్తున్నారు. గని భవిష్యత్‌పై ఒక్కసారిగా చీకట్లు కమ్ముకోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీజు రెన్యూవల్ అయితే గనికి మరో ఎనిమిదేళ్లపాటు జీవితకాలం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు

లీజు రెన్యూవల్‌కు కంపెనీ ఏర్పాట్లు చేస్తోంది. అటవీ శాఖ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నాం. నెల రోజుల్లో అనుమతి వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గని మూసివేసేది లేదు. లీజు రాని ఏరియాను మినహాయించి మిగతా అనుమతి ఉన్న ఏరియా నుంచి బొగ్గు తీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అప్పటి వరకు ఉద్యోగులను ఇతర గనుల్లో సర్దుబాటు చేసే అవకాశం ఉంది.

– టీ.సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్

పీవోడబ్ల్యూ నాయకురాలిపై రౌడీషీట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవీందర్

చెన్నూర్: జిల్లాలోని శ్రీరాంపూర్‌కు చెందిన పీవోడబ్ల్యూ నాయకురాలు మద్దెల భవానిపై చెన్నూర్ పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. శనివారం చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో సీఐ రవీందర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భవాని కొన్నేళ్లుగా చెన్నూర్ ప్రాంతంలో భూ వివాదాల్లో తలదూర్చి బెదిరింపులకు పాల్పడుతోందని పేర్కొన్నారు. చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో ఏడు కేసులు, కోటపల్లి పోలీసుస్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెపై రౌడీషీట్ ఓపెన్ చేశామని అన్నారు. ఇక నుంచి ఆమెపై పోలీసు నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోకపోతే రానున్న రోజుల్లో పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా భూ వివాదాలు, గంజాయి, మత్తు పదార్థాలు అమ్మకం, కొనుగోలు చేసిన వారిపై కొత్త చట్టాల ప్రకారం రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.

'పీవోడబ్ల్యూతో సంబంధం లేదు'

చెన్నూర్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మద్దెల భవానికి పీవోడబ్ల్యూతో ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కుల కోసం తమ సంఘం పోరాడుతోందని, అవినీతి అక్రమాలు చేసే వారిని సహించదని తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ మెహరాజ్ పాష(31) గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

భూవివాదంతో వ్యక్తి ఆత్మహత్య

చెన్నూర్: భూవివాదం కారణంగా వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి చెందిన దాగమ రాజయ్యకు పిల్లలు లేకపోవడంతో 40 ఏళ్ల క్రితం బంధువుల వద్ద నుంచి వెంకన్నను దత్తత తీసుకున్నాడు. రాజయ్య ఆస్తి వెంకన్నకే చెందుతుందని, భావించిన ఆయన సోదరుడు రామయ్య అందులో వాటా కావాలని అడుగుతున్నాడు. దీంతో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. భూ వివాదం తేలకపోవడంతో వెంకన్న (47) మనస్తాపం చెందాడు. గురువారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కుమారుడు సంపత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీఎం కార్యాలయం ముట్టడి



వినతిపత్రం అందిస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్రంలో నూతన బొగ్గు గనుల వేలం వేయడాన్ని నిరసిస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఆరు రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న యూనియన్ నాయకులు కార్యాలయం గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు నిక్షేపాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. గుజరాత్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ పద్ధతిలో కేంద్రం కేటాయించిందన్నారు. సింగరేణికి కూడా అలాగే కేటాయించకపోతే గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి మెమోరాండం సమర్పించారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఫిట్ కార్యదర్శి లక్ష్మణ్, నవీన్‌రెడ్డి, దాడి రాజయ్య, మురళీచౌదరి, సారయ్య, నరసింహారావు మైనింగ్ స్టాఫ్ నాయకులు బాలకృష్ణ, చంద్రమౌళి దేవేందర్ రెడ్డి, లక్కిరెడ్డి సత్తిరెడ్డి రామచందర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాత

తాంసి: తాంసి శివారు బోడగుట్ట ప్రాంతంలో పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాతపడ్డాయి. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడింది. ఆ సమయంలో మేతకు వెళ్లిన మేకలు మృతి చెందగా మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. మేకల కాపరి కిష్టుకు చెందిన 10, రాములుకు చెందిన 2 మేకలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

హెచ్ఐవీ టెస్ట్ అక్కడే!

- ఉమ్మడి జిల్లాలో 5 'ఐసీటీసీ' కేంద్రాలు మూసివేత
- స్థానికుల ఒత్తిడితో ఖానాపూర్‌లో పునఃప్రారంభం
- చెన్నూర్‌లో కూడా తెరిపించాలని పలువురి డిమాండ్
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు, అనుమానితులు



చెన్నూర్ ఏరియా ఆస్పత్రిలో మూసి ఉన్న ఐసీటీసీ కేంద్రం

చెన్నూర్: హేతుబద్ధీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలను మూసివేసింది. తొలి విడుతలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రిలో గల ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ ట్రెనింగ్ సెంటర్ (ఐసీటీసీ) కేంద్రాలు మూసివేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెన్నూర్, మందమర్రి, ఆదిలాబాద్, ఖానాపూర్, ముథోల్‌లో కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో హెచ్ఐవీ పరీక్షలకు అనుమానితులతోపాటు గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికుల ఒత్తిడితో అధికారులు ఇటీవల ఖానాపూర్‌లోని కేంద్రాన్ని మాత్రమే పునఃప్రారంభించారు. మరో నాలుగు కేంద్రాలు తెరుచుకోలేదు. చెన్నూర్ ఆస్పత్రిలో కూడా ఐసీపీటీ సెంటర్ పునఃప్రారంభించాలని పలువురు పేర్కొంటున్నారు.

పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి

చెన్నూర్‌లోని 50 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానుంది. 100 పడకల మాతాశిశు ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోంది. వచ్చే ఏడాది వంద పడకల ఆస్పత్రి ప్రారంభం కానుంది. చెన్నూర్‌లో ఎయిడ్స్ పరీక్ష కేంద్రం లేకపోవడంతో చెన్నూర్‌తో పాటు కోటపల్లి, వేమనపల్లి మండలాల బాధితులు, అనుమానితులు మంచిర్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎయిడ్స్ నిర్ధారణ తర్వాత ఏఆర్టీ సెంటర్ గోదావరిఖనికి వెళ్లాల్సిన దుస్థితి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు, అనుమానితులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్కడికి వెళ్లడం లేదు. వ్యాధి నిర్ధారణ అయినవారు మూడు నెలలకోసారి మందులు తీసుకురావాల్సిన పరిస్థితి.

2007–23 వరకు పరీక్షలు

చెన్నూర్‌లో ఐసీటీసీ కేంద్రాన్ని 2007లో ప్రారంభించారు. అప్పటి నుంచి డిసెంబర్ 2023న కేంద్రాలను మూసివేశారు. 16 ఏళ్లలో చెన్నూర్ కేంద్రంలో 39,821 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12,814 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా 31 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 27,009 మందికి అనుమానిత స్త్రీ, పురుషుల్లో 341 మందికి హెచ్ఐవీ సోకింది. చెన్నూర్ ఐసీటీసీ పరిధిలో 372 మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారు. వీరితోపాటు హెచ్ఐవీ, టీబీ లక్షణాలు ఉన్న 3413 మందికి పరీక్షలు చేశారు. చెన్నూర్‌లో ఈ పరీక్షలు అందుబాటులో లేక మంచిర్యాలకు పరుగులు తీయాల్సి వస్తుంది.

గర్భిణులు గోస..

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి కోసం వచ్చి గర్భిణులకు తప్పనిసరి ఎయిడ్స్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. చెన్నూర్‌లో పరీక్ష కేంద్రం లేకపోవడంతో మంచిర్యాలకు వెళ్లాల్సి రావడంతో గర్భిణులు గోసపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎయిడ్స్ రోగుల ఇబ్బందులను గుర్తించి చెన్నూర్‌లో మూసివేసిన ఎయిడ్స్ పరీక్ష కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వర్షాలకు బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కారాదు

- జీఎం సంజీవరెడ్డి



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కారాదని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఈ ఆర్థికసంవత్సరం నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని, దీన్ని అధిగమించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఓబీ వెలికితీతలో ఇబ్బందులు అధిగమించాలన్నారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మికులకు నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, గని మేనేజర్ ఐ.శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్‌బాబు, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత



మహిళతో బ్లూకోల్ట్స్ పోలీసులు

జన్నారం: మతిస్థిమితం కోల్పోయి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ లింగన్న, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి మానసిక సమస్యతో ఇబ్బంది పడుతుంది. ఆస్పత్రిలో చికిత్స పొందింది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. కుటుంబసభ్యులు డ్యూటీకి వెళ్లిందని అనుకున్నారు. సాయంత్రం తిరిగి రాకపోవడంతో వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం జన్నారం బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించింది. ఓ ఇంట్లో బాత్రూమ్‌లో ఉందని 100 డయల్‌కు సమాచారం అందింది. ఎస్సై రాజవర్ధన్ ఆదేశాలతో హోంగార్డు నరేందర్‌తో కలిసి హెడ్‌కానిస్టేబుల్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్.. బస్టాండ్ ప్రాంతంలో మహిళను గుర్తించారు. ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సాయంత్రం బంధువులు రాగా రాజేశ్వరిని అప్పగించారు. పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలటౌన్: చెడు అలవాట్లకు బానిసై చోరీకి పాల్పడిన ఏసీసీ ఏరియాకు చెందిన జాదవ్ నర్సింగ్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని డీమార్టు పక్కనే ఉన్న అబ్దుల్ రహీం తన ఇంటికి ఈనెల 7న రాత్రి తాళం వేసి ఊరికెళ్లాడు. రాత్రిసమయంలో దొంగ ఆ ఇంటి సీసీ కెమెరా ధ్వంసం చేసి, వెనుక తలుపు పగులగొట్టి చొరబడ్డాడు. సిలిండర్, స్టవ్‌తోపాటు బీరువాలో 5 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. 9న బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో మంచిర్యాల ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, ఎస్సై సనత్ సిబ్బందితో కలిసి దొంగను పట్టుకున్నారు. అతన్ని నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు, సిలిండర్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. చోరీ కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బంది బాబాజి, సత్యనారాయణ, రాజు పటేల్‌ను ఏసీపీ అభినందించారు.

అడవిలో డీసీఎఫ్ పర్యటన



పక్షులను కెమెరాలో బంధిస్తున్న మాధవరావు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్‌లో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(డీసీఎఫ్) సిరిపురం మాధవరావు శనివారం పర్యటించారు. నాలుగురేళ్ల జన్నారం ఫారెస్టు డివిజనల్ అధికారిగా పని చేసిన ఆయన బదిలీపై హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. కుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చిన ఆయనకు రేంజ్ అధికారులు సుష్మారావు, హఫీజొద్దీన్ స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో కలిసి ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లలో పర్యటించారు. పక్షులను గుర్తించి తన కెమెరాలో బంధించారు. నాలుగున్నరేళ్లు ఇక్కడ పని చేసి వెళ్లినందున చూడాలనిపించి వచ్చినట్లు మాధవరావు తెలిపారు. పచ్చని అడవులు, స్వచ్ఛమైన వాతావరణం ఎంతో బాగున్నాయని అన్నారు. గత కొన్ని నెలలుగా ఈ వాతావరణానికి దూరంగా ఉండడం వల్ల అడవులను చూడాలని అనిపించిందని తెలిపారు.

దూషించిన కేసులో ముగ్గురిపై అట్రాసిటీ కేసు

భీమారం: మండలంలోని ఆరెపల్లిలో దళితుల భూములను అక్రమంగా పట్టా చేసుకుని దూషించిన కేసులో భీమారానికి చెందిన కట్ట నాగరాజు, చెర్కు సరోత్తంరెడ్డి, పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. దళితులపై దాడి చేసిన నల్లాల రాజలింగుపై ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. చెన్నూరు కోర్టులో కట్ట నాగరాజుని హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదిలాబాద్ జైలుకి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో బూర్గుడ శివారుప్రాంతంలో పక్కా సమాచారంతోనే పేకాటస్థావరంపై శనివారం దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై గంగన్న తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.13,800 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరిజన నిరుద్యోగులకు ఊరట

- అభయమిచ్చిన హైకోర్టు
- జనరల్ డీఎస్సీపై కీలక పరిణామం
- ఏజెన్సీకి లోబడే నియామకాలు చేపట్టాలి
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం



హైకోర్టు ఎదుట ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): జనరల్ డీఎస్సీలో గిరిజన ప్రాంత పోస్టుల ఊసే లేకుండా నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న నేపథ్యంలో నాలుగు నెలల క్రితం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఎట్టకేలకు కాస్త ఊరట లభించింది. హైకోర్టు న్యాయవాది మామిడి సాయియాదవ్ ఏజెన్సీ గిరిజన నిరుద్యోగుల పక్షాన పలు వాదనలు వినిపించిన అనంతరం హైకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షలు యథావిధిగా నిర్వహించవచ్చని, కానీ నియామకాల ప్రక్రియ మాత్రం తాము తీర్పు ఇచ్చే వరకు నిలిపివేయాలని, ఇందుకు సంబంధించి ఎనిమిది వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జనరల్ డీఎస్సీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6,459మంది గిరిజన నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలు రాయనున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఏజెన్సీ పోస్టులు గిరిజనులకే చెందితే అనేకమంది ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంది.

5వ షెడ్యూల్ కీలకం..

ఏజెన్సీ(గిరిజన ప్రాంతంలో)లో చేపట్టే నియామకాలు గిరిజనులకే వర్తించాలని 5వ షెడ్యూల్ చెబుతోంది. ఎలాంటి నియామకాలు చేపట్టినా గిరిజన ప్రాంతానికే లోబడి ఉంటాయి. దీని ఆధారంగానే ఉమ్మడి రాష్ట్రంలో జీవో నంబరు 3 ప్రకారం ఏజెన్సీలో నియామకాలు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులను పట్టించుకోలేన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో గిరిజన ప్రాంతంలోని ఉద్యోగ నియామకాలకు సంబంధించిన జీవో నంబర్ 3 కొట్టి వేస్తూ.. రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. ఆ తర్వాత కూడా తెలంగాణ ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీలో 75శాతం రిజర్వేషన్ ఇచ్చింది. కానీ జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులపై ఎలాంటి స్పష్టత లేకుండా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గిరిజన నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో పెందోర్ దీపక్ నేతృత్వంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కాస్త ఊరట ఇచ్చే విధంగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

చట్టం తేవాలి

జీవో 3 రద్దు వల్ల గిరిజన నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో నష్టపోయే అవకాశం ఉంది. ఆదివాసీల సంస్కృతి, ఆచారాలు, యాస, భాష వేరుగా ఉండడం వల్ల రాజ్యాంగంలో 5వ షెడ్యూల్‌ను అమలు చేసింది. ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయి. గిరిజనేతరులతో గిరిజనులు పోటీ పడి ఉద్యోగాలు సాధించడం అసంభవం. అందుకే ప్రత్యేక చట్టాలు, జీవోలు తీసుకొచ్చారు. కానీ ప్రభుత్వాలు ఈ విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తున్నాయి. దేశంలోని గిరిజన ఎంపీలు ఏకమై చట్టసభల్లో ఏజెన్సీలోని ఉద్యోగాలు గిరిజనులకే వర్తించేలా ప్రత్యేక చట్టం తీసుకు రావాలని మేధావి వర్గాలు భావిస్తున్నాయి.

న్యాయం జరిగే వరకు ఆందోళనలు



గిరిజన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. మాకు చెందాల్సిన హక్కులు, చట్టాలు గిరిజనేతరుల చేతిలోకి పోతుంటే ఎలా ఊరుకుంటాం. మాకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఏజెన్సీలో నియామకాలు 100శాతం గిరిజనులతో పూరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం.

– పెందోర్ దీపక్, ఏజెన్సీ డీఎస్సీ హక్కుల సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు



గాయపడ్డ ఆనంద్ శ్రీవాత్సవ్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో శనివారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు ఆనంద్ శ్రీవాత్సవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మూడవ నంబర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన కుడి చేతికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా..

- ఆవును తప్పించబోయి చెట్టును ఢీకొన్న కారు
- పదేళ్ల బాలుడి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు
- టీజీపల్లి సమీపంలో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



జైషాన్‌రాజ్ (ఫైల్)



తీవ్రంగా గాయపడ్డ జీజుబాయి, గీత

జన్నారం: బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగివస్తుండగా ఎదురుగా వస్తున్న ఆవును తప్పించబోయి కారు చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో పదేళ్ల బాలుడు మృతి చెందగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జన్నారం మండలం టీజీపల్లి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కొత్తపల్లి (చిక్కులగూడెం)కు చెందిన జాదవ్ గోపిచందు నార్నూర్ సీఐ గన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మంచిర్యాల జిల్లా మందమర్రిలోని తన బంధువుల ఇంటికి శుభకార్యం కోసం కారులో వెళ్లాడు. శనివారం తెల్లవారుజాము తిరుగుపయనమయ్యారు. టీజీపల్లి సమీపంలో ఆవును తప్పించబోయి అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. గోపిచందు కుమారుడు జైసన్‌రాజ్(10) అక్కడికక్కడే మృతి చెందాడు. గోపిచందు, అతని భార్య జాదవ్ గీత, అత్తమ్మ జీజుబాయిలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. పైలట్ రఫీక్, ఈఎంటీ రమేశ్‌లు వెంటనే అక్కడికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గోపిచందు తమ్ముడు జాదవ్ భీంరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తను చంపిన అల్లుడు

- ఆపై గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం
- మంచిర్యాలలో ఘటన



విజయ(ఫైల్)



నిందితుడు వెంకటేశ్



రక్తం మడుగులో విజయ మృతదేహం

మంచిర్యాలటౌన్: అత్తను చంపిన అల్లుడు ఆపై గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చున్నంబట్టివాడలో నివసిస్తున్న నెల్లి విజయ, శేఖర్ దంపతుల కూతురు మాళవికను శాతం వెంకటేశ్‌కు ఆరేళ్ల క్రితం ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి కుమారుడు ఉండగా, గత రెండేళ్లుగా అత్తమామల ఇంట్లోనే వీరు ఉంటున్నారు. డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్న అల్లుడు, శనివారం రాత్రి ఇంట్లో జరిగిన గొడవలో అత్త విజయ(48)పై కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి హత్యచేశాడు. తర్వాత నిందితుడు గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. స్థానికులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించారు. వెంకటేశ్ మార్కెట్‌లో గతంలో బట్టల షాపు నడిపించగా, నష్టం రావడంతో డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నట్లు తెలిసింది. కాగా, హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

'వైద్యపరీక్షల పేరిట డ్యూటీలకు కొర్రీలు'



మాట్లాడుతున్న డి.బ్రహ్మానందం

శ్రీరాంపూర్: యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యపరీక్షల పేరిట డ్యూటీలకు కొర్రి పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం పేర్కొన్నారు. శనివారం నస్పూర్ కాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులతో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి చిన్న సమస్య ఉన్నా డ్యూటీలకు తీసుకోకుండా నాట్ ఫర్ అలో డ్యూటీ అని వైద్యులతో రాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఏనాడు వారి ఆరోగ్యాన్ని పట్టించుకోని యాజమాన్యం నేడు కొత్తగా పరీక్షల పేరుతో డ్యూటీలకు ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. నాయకులు రాజేందర్, శంకర్, తిరుపతి, గోపాల్, అప్పారావు, జంపయ్య, సంపత్, నాగరాజు, కొమరయ్య ఉన్నారు.

'గిరిజన నాయకుడిని గౌరవించని మంత్రులు'



మాట్లాడుతున్న బానోత్ జగన్, తదితరులు

నార్నూర్: రెండుసార్లు ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా, ఎంపీగా సేవలందించిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం గిరిజన నాయకుడిని అవమానించడమేనని లంబాడి జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి రాథోడ్‌కు నిర్వహించకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఈనెల 11న చేపట్టిన రైతుల అభిప్రాయ సేకరణకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కూతవేటు దూరంలో పూలాజీబాబా పాఠశాలలో నిర్వహించిన పెద్దకర్మకు రాకపోవడం శోచనీయమన్నారు. రాథోడ్ రమేశ్‌కు నివాళిర్పించకపోవడం ఆయనపై మంత్రులకు గౌరవం లేదన్నారు. సమావేశంలో లంబాడి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్, ఫ్యాక్స్ చైర్మన్ ఆడే సురేష్, నాయకులు పవర్ దేవిదాస్, గణేశ్, భీంరావు, రామారావు, సంతోష్, రామ్ మహరాజ్, రాంజీ రాథోడ్, రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.